క్లుప్తంగా

విద్యాజ్యోతి పుస్తకాలను వినియోగించుకోండి



భట్టిప్రోలు: భట్టిప్రోలు టీఎంరావు హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు జగనన్న విద్యాజ్యోతి పుస్తకాలను జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి, సర్పంచ్ దారా రవి కిరణ్మయిలు కలసి సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ ఈ పుస్తకాలను ఉపయోగించుకుని విద్యార్థులు మంచి మార్కులను సాధించాలని పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు చందలూరి రామకోటేశ్వరరావు, కరస్పాండెంట్ పి. మల్లిఖార్జున రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కనుల పండువగా గోదాదేవి పూజలు



రేపల్లె రూరల్: ధనుర్మాసాన్ని పురస్కరించుకుని పట్టణంలోని శ్రీ పట్టాభిరామ స్వామి ఆలయంలో ప్రతిష్ఠించిన గోదాదేవి అమ్మవారికి సోమవారం మంగళా శాసన, పాశురం వేడుకలను కనుల పండువగా నిర్వహించారు. అమ్మవారికి సుప్రభాత సేవలు, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి నెమలి పించాలతో అలంకరించారు. అమ్మవారికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు గోదాదేవి చరితమును వివరించారు. భక్తులు వేకువజామునే ఆలయానికి చేరుకుని అమ్మవారికి పసుపు, కుంకుమలు, నూతన వస్త్రాలతో కూడిన సారెను అందించారు. మహిళలు అధిక సంఖ్యలో సామూహిక హారతులు పట్టారు. అనంతరం గోదాదేవిని స్తుతిస్తూ ఆలయ ఆవరణంలో కోలాట ప్రదర్శన చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తటవర్తి విజయ్‌కుమార్, రాధికారాణి పాల్గొన్నారు.

క్యాన్సర్ రోగికి డాక్టర్ ఈవూరి ఆర్థికసాయం



రేపల్లె రూరల్: మండలంలోని పేటేరు పంచాయతీ గొడపాలెంకు చెందిన ఆరేపల్లి మంగమ్మ క్యాన్సర్ వ్యాధితో బాధపడుతోంది. గ్రామస్తులు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్ దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన ఆయన మంగమ్మ గృహం వద్దకు సోమవారం వెళ్లి ఆమెను పరామర్శించారు. రూ.10 వేల ఆర్థికసాయాన్ని అందించారు. మంగమ్మ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. చెరుకుపల్లి మండలం గుళ్లపల్లిలోని ఈఎస్ఆర్ హాస్పిటల్‌లో వైద్య పరీక్షలు చేయించి అవసరమైన మందులు అందిస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట మాజీ ఎంపీటీసీ సభ్యుడు రావు ప్రభాకరరావు, వైఎస్సార్‌సీపీ గ్రామ ఇన్‌ఛార్జ్ కనపర్తి రవికిరణ్, తదితరులు పాల్గొన్నారు.

పింఛన్లు పంపిణీ

కర్లపాలెం: దేశంలోని ఏ రాష్ట్రంలోనూ లేనివిధంగా మన రాష్ట్రంలో సీఎం జగన్ సామాజిక పింఛన్లు రూ.3వేలకు పెంచి ఇవ్వటం అభినందనీయమని పాతనందాయపాలెం సర్పంచ్ కావూరి చిట్టెమ్మ, ఏట్రవారిపాలెం సర్పంచ్ చీరాల వెంకటలక్ష్మిలు అన్నారు. సోమవారం పాతనందాయపాలెం పంచాయతీ పరిధిలో మంజూరైన పింఛన్లను సర్పంచ్ చిట్టెమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు పద్మావతి పంపిణీ చేయగా ఏట్రవారిపాలెం పంచాయతీ పరిధిలో మంజూరైన పింఛన్లను సర్పంచ్ వెంకటలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు పద్మావతి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి దొంతిరెడ్డి పద్మావతి, సచివాలయం సిబ్బంది, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

పాత విద్యుత్తు చార్జీలను కొనసాగించాలి

రేపల్లె రూరల్: విద్యుత్తు వినియోగ చార్జీలలో ఎటువంటి మార్పులు లేకుండా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అమలులో ఉన్న ఎనర్జీ చార్జీలనే రాష్ట్రంలోని మూడు పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్‌లు అమలు చేయాలని పట్టణాభివృద్ధి సంఘ కార్యదర్శి సీవీ మోహనరావు అన్నారు. స్థానిక కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడారు. విద్యుత్ వినియోగదారులను నిలువు దోపిడీ చేసేందుకు పోటీపడుతున్న పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్‌లు విద్యుత్ చార్జీల పెంపు నిర్ణయం ఉపసంహరించుకోవాలన్నారు. విద్యుత్ వినియోగదారుల ఆర్థిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని ప్రస్తుతం అమలులో ఉన్న విద్యుత్ ఎనర్జీ ఛార్జీలనే 2024–25 ఆర్థిక సంవత్సరంలోనూ అమలు చేస్తామని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చెప్పిన విధంగానే డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్, ఏపీ విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్‌లు అమలు చేయాలని కోరారు.

సంక్రాంతి సంబరాలకు ముమ్మరంగా ఏర్పాట్లు

- కోన ట్రస్టు ఆధ్వర్యంలో వేడుకలకు సర్వం సిద్ధం
- సంబరాల పోస్టర్లను ఆవిష్కరించిన ఎమ్మెల్యే కోన



సంబరాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కోన రఘుపతి

బాపట్ల: కోన ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించేందుకు సిద్ధమయ్యామని ట్రస్టు అధ్యక్షులు, బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు.సంక్రాంతి సంబరాల పోస్టర్లను స్థానిక కోన ఛాంబర్‌లో ఎమ్మెల్యే కోన రఘుపతి సోమవారం ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ కోన ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ప్రతి ఏడాదిలానే ఈ ఏడాది కూడా 13, 14 తేదీల్లో సంక్రాంతి సంబరాలు ఉంటాయని తెలిపారు. 13న రాత్రి తిరుమల తిరుపతి దేవస్థానం, అహోబిలం, కంచికామకోటి పీఠం అస్థాన విద్వాంసులు గరిమెళ్ళ బాలకృష్ణ ప్రసాద్‌చే భక్తి గీతాలాపన కార్యక్రమం ఉంటుందన్నారు. 14వ తేదీన ఉదయం 5 గంటలకు భోగిమంటలు, 7 గంటలకు ధాన్యలక్ష్మీ పూజా కార్యక్రమాలు, 9 గంటలకు పొంగలి నివేదన ఉంటాయని వివరించారు. సాయంత్రం స్థానిక ఆర్ట్స్‌అండ్ సైన్సు కళాశాలలో మ్యూజికల్ నైట్, సినీ సంగీత విభావరి, కామెడీషో ఉంటుందన్నారు. ప్రత్యేక అతిథులుగా డీజే సినీ హిరో సిద్ధు జొన్నలగడ్డ, మ్యూజిక్ డైరెక్టర్స్ భీమ్స్, రామ్ మిరియాల, జబర్దస్త్ కళాకారుడు చమ్మక్ చంద్ర పాల్గొంటున్నారని తెలిపారు. సినీ గాయకుల సంగీత విభావరిలో గాయకులు సింహా, సాకేత్, మాళవిక, రమ్యబెహరా, వరం పాల్గొంటున్నారని తెలిపారు. జబర్దస్త్ కామెడిషో టీమ్ లీడర్ చమ్మక్ చంద్ర ఆధ్వర్యంలో సత్తిపండు, పవన్, సత్యశ్రీ, సద్దాం, భాస్కర్, నవసందీప్, పులి, నూకరాజు పాల్గొంటారని చెప్పారు. ఈ కార్యక్రమానికి యాంకర్‌గా దీప్తి నల్లమోతు వ్యవహరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమాలను తిలకించి పండుగను ఆనందంగా జరుపుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ,మండల పార్టీ అధ్యక్షులు కాగిత సుధీర్‌బాబు,కోకి రాఘవరెడ్డి, నాయకులు చేజర్ల నారాయణరెడ్డి, షేక్ సయ్యద్‌మీర్, గేరా మణిభూషణం, ఇమ్మడిశెట్టి శ్రీనివాసరావు, నర్రావుల వెంకట్రావు, గవిని కృష్ణమూర్తి, జోగిరాజా,అడే చందు,రంగారావు, నర్రా వెంకట్రావు, బండికళ్ల బాబురావు తదితరులు ఉన్నారు.

ఉత్సాహంగా సంక్రాంతి సంబరాలు

రేపల్లె రూరల్: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని పట్టణంలోని రామకృష్ణ పబ్లిక్ స్కూలులో సోమవారం నిర్వహించిన సంక్రాంతి వేడుకలను స్కూల్ కరస్పాండెంట్ కుర్రా అపర్ణ ప్రారంభించారు. వేడుకల్లో భాగంగా పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. చిన్నారులు నిర్వహించిన హరిదాసుల వేష ధారణలు, భోగి మంటల చుట్టూ తిరుగుతూ చేసిన కోలాట నృత్యాలు, ముగ్గుల పోటీలు ఎంతగానో ఆకర్షించాయి. ఈ సందర్భంగా కరస్పాండెంట్ అపర్ణ విద్యార్థులకు సంక్రాంతి పండుగ విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో స్కూల్ అధ్యక్షుడు డాక్టర్ కుర్రా మహేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేడుకగా సంక్రాంతి సంబరాలు

కొల్లూరు : తెలుగుదనం ఉట్టిపడే సంక్రాంతిని పురస్కరించుకొని పలు ప్రైవేటు పాఠశాలల్లో సంక్రాంతి సంబరాలు వైభవంగా నిర్వహించారు. సోమవారం కొల్లూరు సమీపంలోని ఫోర్‌ఫ్రంట్ పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు సంప్రదాయ దుస్తులలో సంక్రాంతి సంబరాలు నిర్వహించి సంస్కృతీ, సంప్రదాయాల విలువలు చిన్నారులకు అర్థమయ్యే రీతిలో పలు కార్యక్రమాలు చేపట్టారు. సంబరాలలో భాగంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన గంగిరెద్దు విన్యాసాలను చిన్నారులు ఆసక్తిగా తిలకించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



సంక్రాంతి వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు



గంగిరెద్దుల విన్యాసాలను తిలకిస్తున్న విద్యార్థులు

ఘనంగా సంక్రాంతి సంబరాలు

కర్లపాలెం: విద్యార్థులకు సంస్కృతీ సంప్రాదాయలతో పాటు పండుగల విశిష్టతను తెలియజేయాల్సిన ఆవశ్యకత ఉందని శ్రీభార్గవి హైస్కూల్ వ్యవస్థాపకుడు పేరాల వెంకట సురేష్ తెలిపారు. కర్లపాలెం శ్రీ భార్గవి హైస్కూల్‌లో సోమవారం ఘనంగా సంక్రాంతి సంబరాలు జరిగాయి. ఈ సంబరాలలో భాగంగా పాఠశాలను సుందరంగా తీర్చిదిద్దారు. బాలికలు పలు రకాల రంగవల్లులు వేశారు. విద్యార్థులు హరిదాసులు, జంగమదేవర, సోదెమ్మ వేషధారణలో అలరించారు. చిన్నారులకు భోగిపళ్లు పోశారు. పాఠశాల ఆవరణలో బొమ్మల కొలువు ఏర్పాటు చేశారు. భోగి మంటలు వేసి సందడి చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మి, రిజ్వానా, ప్రేమావతి, సాహితి, బిందు, పావని, చక్రవర్తి, దివ్య, సౌజన్య, సునీత, శ్రీనివాసరావు, బుజ్జిబాబు, శ్రీమన్నారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్నికల విధుల్లో బాధ్యతగా పనిచేయాలి

ఆర్డీవో హేలా షారోన్



అధికారులకు సూచనలిస్తున్న హేలా షారోన్

రేపల్లె రూరల్: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు అధికారులు పనిచేయాలని ఆర్డీవో హేలా షారోన్ చెప్పారు. స్థానిక రెవెన్యూ డివిజినల్ కార్యాలయంలో ఎన్నికల నిర్వహణపై నియోజకవర్గంలోని తహసీల్దార్‌లు, ఎంపీడీవోలు, వివిధ శాఖల అధికారులతో సోమవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సమయం సమీపిస్తున్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అధికారులు తమ మండలాల పరిధిలోని పోలింగ్ బూత్‌లు, రూట్ మ్యాప్‌లను పరిశీలించుకోవాలన్నారు. పోలింగ్ బూత్‌లు పరిశీలించి మరమ్మతులు చేయాల్సి వస్తే తమకు నివేదించాలన్నారు. ఎన్నికల విధులపై పలు అంశాలను వివరించారు. సమావేశంలో నాలుగు మండలాల తహసీల్దార్‌లు, ఎంపీడీవోలు, అధికారులు పాల్గొన్నారు.

స్పందనకు 9 అర్జీలు

ప్రజా సమస్యల పరిష్కారానికై నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమానికి 9 అర్జీలు అందినట్లు ఆర్డీవో హేలా షారోన్ తెలిపారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించిన అనంతరం మాట్లాడారు. సచివాలయానికి వేసిన రంగులకు సంబంధించిన బిల్లులను ఇప్పించాలని జంపని గ్రామం నుంచి ఒక అర్జీ, మురుగునీటి పారుదలకై పిరాట్లంక గ్రామం నుంచి అర్జీ అందగా, ప్రభుత్వ పోరంబోకులలో ఆక్రమణలు తొలగించాలని ఇసుకపల్లి నుంచి ఒక అర్జీ, 5వ వార్డు నుంచి రెండు అర్జీలు, వృద్ధాప్యపు పింఛన్ ఇప్పించాలని ఇసుకపల్లి నుంచి ఒక అర్జీ, తన సాగుభూమిని ఆన్‌లైన్ చేయాలని చుండూరు నుంచి ఒక అర్జీ అందాయన్నారు. అదేవిధంగా పట్టణంలోని 5వ వార్డు నుంచి రైతుభరోసా మంజూరుకై ఒక అర్జీ అందగా నివేసన స్థలం సర్వేకై మరో అర్జీ అందిందన్నారు.

కార్యకర్తల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం



వరికూటిని కలసిన పెదపులివర్రు గ్రామస్తులు

వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి

భట్టిప్రోలు: వైఎస్సార్‌సీపీ కార్యకర్తలే పార్టీకి కొండంత బలమని.. వారిని అన్ని విధాలా ఆదుకుంటానని వైఎస్సార్‌సీపీ వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు అన్నారు. సోమవారం అమృతలూరు మండలం కూచిపూడిలోని క్యాంప్ కార్యాలయంలో వరికూటిని ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి పెదపులివర్రు గ్రామస్తులతో కలసి తమ సమస్యలు వివరించారు. ఈ సందర్భంగా ఆయన కొన్ని సమస్యలను ఫోన్‌లో అధికారులతో మాట్లాడి అక్కడికక్కడే పరిష్కరించారు. మిగిలిన సమస్యల పరిష్కారానికి సానుకూలంగా స్పందించి తనవంతు కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు దావూరి నాగమల్లేశ్వరరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పేదల కళ్లల్లో ఆనందమే ప్రభుత్వ లక్ష్యం

- రాజ్యసభ సభ్యుడు మోపిదేవి
- ఈవూరి గణేష్‌తో కలసి పింఛన్ల పంపిణీ

చెరుకుపల్లి: పింఛన్ నగదు పెంపుతో అవ్వాతాతలు, అక్క చెల్లెమ్మలకు ముందుగానే సంక్రాంతి పండుగను సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి తెచ్చారని రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. సోమవారం చెరుకుపల్లి ఆర్యవైశ్య కల్యాణ మండపంలో వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్‌తో కలసి పెంచిన రూ.3 వేలు పింఛన్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రమణారావు మాట్లాడుతూ పేదోడి కళ్లల్లో ఆనందం నింపడమే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పని చేస్తున్నట్లు చెప్పారు. టీడీపీ పాలనలో దోచుకోవడం..దాచుకోవడం తప్ప ప్రజలకు చేసింది ఏమీ లేదన్నారు.సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం ఎన్నికల హామీని నిలబెట్టుకున్నారన్నారు. ఈవూరి గణేష్ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు అమలు కావాలంటే మళ్లీ వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంగా చేయాలన్నారు. నవరత్నాల్లో భాగంగా 95 శాతంకు పైగా హామీలు అమలు చేశారని పేర్కొన్నారు. అర్హులందరికీ నేరుగా సంక్షేమ పథకాలు అందిస్తూ పేదల కళ్లల్లో సంతోషం నింపుతున్నారన్నారు.కార్యక్రమంలో ఎంపీపీ మత్తి దివాకర రత్న ప్రసాద్, జెడ్పీటీసీ సభ్యురాలు మర్రివాడ వెంకట పావని, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పయనం ఏడుకొండలరెడ్డి, సర్పంచ్ దేవరకొండ వాణి, పార్టీ నాయకులు చెన్ను కోటేశ్వరరావు, కామినేని కోటేశ్వరరావు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్ సీపీ వివిధ విభాగాల నేతలు పాల్గొన్నారు.

నేడు కొత్త పింఛన్లు పంపిణీ

అమర్తలూరు(వేమూరు): మండల పరిషత్ కార్యాలయంలో కొత్తగా మంజూరైన పింఛన్లను మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు పంపిణీ చేయడం జరుగుతుందని మండల పార్టీ అధ్యక్షుడు యలవర్తి సురేష్ సోమవారం తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త వరికూటి అశోక్ బాబు పాల్గొంటారని చెప్పారు.

పాఠశాలకు టీవీ అందజేత

కర్లపాలెం: విద్యార్థులు సులభంగా పాఠాలు నేర్చుకునేందుకు గానూ దాతలు ఫోర్‌కే టెక్నాలజీ కలిగిన టీవీ అందజేయటం అభినందనీయమని ఎంఈవో ఎస్.విజయశ్రీ అన్నారు. చింతాయపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు సోమవారం గ్రామానికి చెందిన దొప్పలపూడి శ్రీవల్లి ప్రోత్సాహంతో బెస్ట్ రన్నర్స్ ఆర్గనైజేషన్ వారి ఆర్థిక సహకారంతో రూ.70వేలు విలువ కలిగిన స్మార్ట్ టీవీ, ప్రింటర్‌ను ఎంఈవో విజయశ్రీ చేతుల మీదుగా పాఠశాలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉషాకిరణ్, వై.నాగమురళి, తిరుపతమ్మ, పోలీస్‌రావు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాండురంగ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

బాపట్ల అర్బన్ : శ్రీ లలితా త్రిపుర సుందరీ పీఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మండల విశేష పూజా కార్యక్రమాల్లో భాగంగా ఈ నెల 11న సాయంత్రం 4 గంటల నుంచి బాపట్ల చీలు రోడ్డు వద్ద గల శ్రీ పాండురంగ స్వామి దేవాలయ ప్రాంగణంలో కమలాత్మిక హోమం, శ్రీలక్ష్మీ పుష్పార్చన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు నెమలికంటి హనుమంతరావు సోమవారం తెలిపారు.పూజా కార్యక్రమాల్లో పాల్గొను భక్తులు నిర్వాహకులను సంప్రదించాలని కోరారు.

బీసీ సంక్షేమ సంఘం క్యాలెండరు ఆవిష్కరణ

తెనాలి: బీసీ సంక్షేమ సంఘం నూతన సంవత్సర క్యాలెండరును సోమవారం స్థానిక గంగానమ్మ పేటలోని సంఘ కార్యాలయంలో సంఘం రాష్ట్ర యువజన ఉపాధ్యక్షుడు గుర్రం ద్వారకా శ్రీను ఆవిష్కరించారు. బీసీ సంఘీయుల అభివృద్ధికి కృషి చేయాలని, ప్రభుత్వం కుల జనగణనను పూర్తిచేయాలని కోరారు. రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి కొల్లూరు హనుమంతరావు మాట్లాడుతూ బీసీ, ఎస్సీ, ఎస్టీలపై దాడులకు పాల్పడినవారిని కఠినంగా శిక్షించాలని కోరారు. సంఘం తెనాలి పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ వేముల కృష్ణ, సోమరౌతు సతీష్ పాల్గొన్నారు.

భారతీయ సంస్కృతిని భావి తరాలకు అందివ్వాలి

మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ



విజేతలకు బహుమతులు అందజేస్తున్న చైర్‌పర్సన్ మంగ

రేపల్లె రూరల్: భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను పరిరక్షించుకుని భవిష్యత్ తరాలకు అందించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ అన్నారు. సంక్రాంతి నెలను పురస్కరించుకుని మదర్‌థెరీసా మహిళా యునెస్కో క్లబ్ ఆధ్వర్యంలో పత్తిపాటి సీతారామయోగిని కల్యాణ మండపంలో నిర్వహించిన ముగ్గుల పోటీలలో ఆమె పాల్గొని మాట్లాడారు. తెలుగువారు నిర్వహించుకునే పెద్దపండుగ సంక్రాతి అన్నారు. సంక్రాంతి నెల రోజులు మహిళలు తమ ముంగిళ్లలో రంగవల్లులను నెలకొల్పి లక్ష్మీదేవికి స్వాగతం పలుకుతారని చెప్పారు. మహిళలను ప్రోత్సహించేందుకు క్లబ్ సభ్యులు ఈ పోటీలను నిర్వహించటం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ డైరెక్టర్ దాసరి ఝాన్సీలక్ష్మి, సభ్యులు ఎస్.విజయ, భారతి, సీహెచ్ లక్ష్మి, షేక్ అస్మా, తదితరులు పాల్గొన్నారు.

10 నుంచి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు



క్రీడాకారులకు అందించే మెటీరియల్‌ను చూపుతున్న ఎంపీపీ, తదితరులు

భట్టిప్రోలు: ఈ నెల 10వ తేదీ నుంచి మండల స్థాయిలో జరిగే ఆడుదాం ఆంధ్రా క్రీడల్లో పాల్గొనే ప్రతి క్రీడాకారుడికి టీషర్ట్, టోపీ ఉచితంగా అందజేయడం జరుగుతుందని ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి తెలిపారు. సోమవారం భట్టిప్రోలు మండల పరిషత్ కార్యాలయంలో క్రీడాకారులకు అందించనున్న మెటీరియల్‌ను జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరితో కలసి ఆమె పంచాయతీ కార్యదర్శులకు అందజేశారు. ఎంపీపీ మాట్లాడుతూ క్రీడాకారులు మండల స్థాయిలో సత్తా చాటి రాష్ట్ర స్థాయికి ఎంపికై తద్వారా మండలానికి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపీడీవో గుమ్మా చంద్రశేఖరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు దావూరి నాగమల్లేశ్వరరావు, తిరువీధుల బాలాజి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసుల పరిష్కారంలో అలసత్వం వద్దు

డీఎస్పీ మురళీకృష్ణ



రికార్డులను పరిశీలిస్తున్న మురళీకృష్ణ

రేపల్లె రూరల్: పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించాలని రేపల్లె డీఎస్పీ తక్కెళ్లపాటి మురళీకృష్ణ ఆదేశించారు. వార్షిక తనిఖీలలో భాగంగా పట్టణంలోని సర్కిల్ కార్యాలయాన్ని సోమవారం ఆయన సందర్శించి రికార్డులను పరిశీలించారు. పట్టణ సర్కిల్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న 89 కేసులను పరిష్కరించాలన్నారు. చోరీలు, రహదారి ప్రమాదాలను నివారించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. రాత్రుల సమయంలో గస్తీని పెంచాలన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో సమస్యాత్మక ప్రాంతాలపై నిఘా ఉంచటంతో పాటు రౌడీషీటర్ల కదలికలను గమనిస్తూ ఉండాలన్నారు. సంక్రాంతి నేపథ్యంలో ఎటువంటి జూదాలు జరగకుండా గట్టి బందోబస్తు నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం రికార్డులను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. కార్యక్రమంలో పట్టణ సీఐ నజీర్‌బేగ్, ఎస్ఐలు, సిబ్బంది ఉన్నారు.

కనువిందుగా ధనుర్మాస వేడుకల శోభాయాత్ర

తెనాలి: పట్టణానికి చెందిన శరణాగతి గోష్టి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధనుర్మాస వేడుకల్లో భాగంగా సోమవారం శోభాయాత్ర నిర్వహించారు. స్థానిక వీఎస్సార్ అండ్ ఎన్వీఆర్ కాలేజి రోడ్డులోని యర్రంశెట్టి గంగాధర్, యర్రంశెట్టి రమేష్‌బాబు స్థలప్రాంగణంలో ధనుర్మాస ఉత్సవాలు జరుగుతున్నాయి. ఈనెల 14 వరకు జరిగే కార్యక్రమాల్లో భాగంగా సోమవారం సాయంత్రం పట్టణంలో శోభాయాత్ర నిర్వహించారు. నరేంద్ర రామానుజ దాసస్వామి నేతృత్వంలో మార్కెట్ సెంటర్లోని రాములవారి ఆలయం నుంచి శోభాయాత్ర ప్రారంభించారు. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, ప్రియదర్శిని విద్యాసంస్థల చైర్మన్ చందు రామారావుతో కలిసి స్వామి వారి విగ్రహాన్ని చేతపట్టుకుని శోభాయాత్రలో పాల్గొన్నారు. కోలాట ప్రదర్శనలు, మేళతాళాలు, మంగళవాయిద్యాలతో శోభాయాత్ర పురవీధుల్లో కొనసాగింది. భక్తులందరూ కాషాయ జెండాలతో పాల్గొన్నారు. గోదాదేవి, శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్‌స్వామి వేషధారణలు మరో ఆకర్షణ. కౌన్సిలర్లు గొడవర్తి సాయిహరేరామ్, తోట రఘురామ్, వైఎస్సార్‌సీపీ క్లస్టర్–1 అధ్యక్షుడు మద్దాళి శేషాచలం, కఠారి హరీష్, పెనుగొండ వెంకటేశ్వరరావు, దోనుగుంట్ల రామమోహనరావు, తన్నీరు సీతారామయ్య, విష్ణుమొలకల వాలేశ్వరరావు, తమ్మన సాంబశివరావు, సమరసత ఫౌండేషన్ ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు, శరణాగతి గోష్టి సభ్యులు, దాస సాహిత్య ప్రాజెక్టు, హరే శ్రీనివాస భజన సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

సమరసత సేవాసంఘం సభ్యులకు సత్కారం



నూతన వస్త్రాలతో సత్కరిస్తున్న భక్తులు

ఐలవరం(భట్టిప్రోలు): ధనుర్మాసాన్ని పురస్కరించుకుని భట్టిప్రోలు మండలం ఐలవరంలో సోమవారం సమరసత సేవా ఫౌండేషన్ (ఎస్ఎస్ఎఫ్) ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎస్ఎఫ్ సభ్యులకు గ్రామానికి చెందిన మాచర్ల యజ్ఞనారాయణ నూతన వస్త్రాలు అందచేశారు. అన్న ప్రసాదాన్ని వితరణ చేశారు. ఎస్ఎస్ఎఫ్ బాపట్ల జిల్లా ఖండ ప్రముఖ్ పొన్నపల్లి సత్యన్నారాయణ మాట్లాడుతూ గ్రామ సంకీర్తన సంఘం ఆధ్వర్యంలో గత ఆరేళ్ళుగా నగర సంకీర్తన నిర్వహించడం సాధారణ విషయం కాదన్నారు. కార్యక్రమంలో జిల్లా పరియోజన ప్రముఖ్ పడమట వెంకటేశ్వరరావు, బాపట్ల జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు, మహిళా కన్వీనర్ బూర్లె అరుణ కుమారి, మండల కన్వీనర్ పడమట వెంకటేశ్వరరావు, ధర్మ ప్రచారక్ చింతల మురళీకృష్ణ, నిర్వాహకులు బట్టు వీరరాఘవయ్య, తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభ రసాభాస

పిట్టలవానిపాలెం: గ్రామంలో నెలకొని ఉన్న సమస్యలను పరిష్కరిస్తేనే గ్రామ పంచాయతీకి చెల్లించాల్సిన పన్నులు చెల్లిస్తామని భవనంవారిపాలెం గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు కొందరు ధ్వజమెత్తారు.మండలంలోని భవనంవారిపాలెం గ్రామ సచివాలయంలో సోమవారం గ్రామ సర్పంచ్ మోదుగుల శివనాగేశ్వరి అధ్యక్షతన గ్రామసభను నిర్వహించారు.ఈ సందర్భంగా వార్డు సభ్యులు భరత్‌రెడ్డి, కలకోట శ్రీనివాసరెడ్డిలు పలు అంశాలపై అధికారులను నిలదీశారు. ప్రధానంగా గ్రామంలో వీధిలైట్లు వెలగడం లేదని, వీధులలో చెత్త సేకరణ చేయడం లేదని దీంతో ఎక్కడి చెత్త అక్కడే నిల్వ ఉండి ఇబ్బందిగా ఉందని వివరించారు. ఈ సమస్యలపై తక్షణమే చర్యలు తీసుకోకపోతే పంచాయతీకి చెల్లించాల్సిన పన్నులు చెల్లించేది లేదని తేల్చి చెప్పారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ బడుగు మాధవి, వీఆర్వో సర్వేశ్వరరావు, గ్రామస్తులు ఉన్నారు.

బేతపూడిలో ఫైలేరియా రక్త పరీక్షలు



ఫైలేరియా సర్వే చేపడుతున్న అధికారులు

బాపట్ల: బేతపూడి గ్రామంలో ఫైలేరియా సర్వే కార్యక్రమాన్ని వెదుళ్లపల్లి వైద్యాధికారిణి పి.మానస ప్రియదర్శిని ఆధ్వర్యంలో సోమవారం చేపట్టామని జిల్లా సబ్‌యూనిట్ ఆఫీసర్ ఎండీ షకీల్ మహమ్మద్ తెలిపారు. 20 నుంచి 60 సంవత్సరాల వయస్సు కలిగిన స్త్రీ, పురుషుల నుంచి రాత్రిపూట రక్తపూతలు సేకరించటం జరుగుతుందని చెప్పారు. మూడు రోజుల పాటు రక్తపూతలు సేకరిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది డి.ప్రసాద్, ఎస్.రవిశంకర్, జి.రెబ్కా, ఆర్.కల్యాణి, చంద్రమోహన్, షర్మిల, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

చెకుముకి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులతో పాఠశాల ఉపాధ్యాయులు

అమర్తలూరు(వేమూరు): జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు సమంత్, సృజని జిల్లా స్థాయి చెకుముకి పోటీల్లో తృతీయ స్థానంలో నిలిచారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు నిరీక్షణరావు తెలిపారు. జన విజ్ఞాన కేంద్రం వారు 35 మండలాల నుంచి మండల స్థాయిల్లో చెకుముకి సైన్సు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఎంపికైన విద్యార్థులతో బాపట్ల జిల్లా చినగంజాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో సైన్సు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో సమంత్, సృజని తృతీయ స్థానంలో నిలిచారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

వేమూరు: పదో తరగతి విద్యార్థులు జగనన్న విద్యాజ్యోతి మెటీరియల్ పుస్తకాలు చదవడం ద్వారా మంచి మార్కులు సాధించవచ్చని జెడ్పీటీసీ సభ్యురాలు గాజుల హేమలత అన్నారు. వేమూరు మండల కేంద్రంలోని ప్రభుత్వం ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు సోమవారం పుస్తకాలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో హెచ్ఎం పద్మజ, మండల ఉపాధ్యక్షులు షేక్ బాజీ, కోఆప్షన్ మెంబరు తలతోటి సువర్ణరావు, సొసైటీ అధ్యక్షులు గాజు భాను ప్రకాశ్, దొప్పలపూడి జ్యోతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.